అతని ప్రవర్తనే
చాదస్తంగా భావించే
ఆ యింట్లో
అతను
ఎలా బ్రతికాడు?

# అలపర్తి రామకృష్ణ కథ

# లాస్ట్ డిజిట్

నిద్ర లేవగానే కేలండరు కేసి చూశాడు లక్ష్మినాయుడు.

సెప్టెంబరు, 9.

లక్కీ నెంబర్!

తేదీ, నెల రెండూ తొమ్మిది అంకెలే!

ఆ అంకెలోనే తన అదృష్టం.

ఎగిరి గంతులేసే వయస్సు కాకపోయినా ఎగిరి గంతేసేడు.

తొమ్మిది అంకె తనకెప్పుడూ కలిసివొస్తుంది. తను పుట్టింది తొమ్మిదినే, పెళ్ళయ్యింది, కొడుకు పుట్టింది కూడా సెప్టెంబరు తొమ్మిదివే! కొడుక్కి 'వర్క్స్ మానేజర్'గా సిమెంటు ఫ్యాక్టరీలో వుద్యోగం వచ్చింది కూడా అదే తారీఖున.

... ఈరోజు తను ఏ పని తలపెట్టినా జయప్రదమే!...

... హిమాచల్ ప్రదేశ్ స్టేట్ లాటరీస్ ఫలితాలు పేపర్లో పడివుంటాయి. మొన్న గురువారం 'డ్రా' తీసి వుంటారు...

ప్రథమ బహుమతి వస్తే బావున్ను... తప్పకుండా బహుమతి వొస్తుంది తనకి...

హాల్లోకి వొచ్చాడు. పేపరు కోసం వెతికాయి కళ్ళు.

కళ్ళల్లో సోఫాలో కూర్చుని పేపరు చదువుతున్న వివేక్ కన్పించేడు. వెనక్కి తిరిగి బాత్‌రూముకేసి వెళ్ళబోయాడు.

"పేపరు కావాలా నాన్నగారూ? లాటరీ ఫలితాలు చూస్తారా?" తండ్రివైపు చూస్తూ అడిగాడు వివేక్.




... తన బలహీనతలమీదే దెబ్బకొడతాడు వివేక్... తమ పక్కన కూర్చుని ఎ,బి,సి,డిలు దిద్దించిన కొడుకు ఎంతగా ఎదిగిపోయాడు... ఇంజనీరయ్యాడు... తనకే 'అది చెయ్యకూడదు ... ఇది చెయ్యకూడ'దంటూ పాఠాలు చెబుతున్నాడు.

''లాటరీ టికెట్లు కొనడం మానేశాను'' అనేశాడు లక్ష్మీనాయుడు.

ఎక్కువసేపు అక్కడ నిలబడలేకపోయాడు. మొహం కడుక్కోవ డానికి పెరట్లోకి వెళ్ళాడు బ్రష్ నోట్లో పెట్టుకుని.

వెనుక యింట్లో వున్న రఘుపతి పలుకరించాడు కాంపౌండ్‌వాల్ అవతల పక్కనుంచి.

నోట్లోవున్న పేస్టు మరగ కొబ్బరిచెట్టు పాదులో వూశాడు. అలా చెట్ల పాదుల్లో ఎక్కడ పడితే వుయ్యకూడదని అంతకుముందు కోడలు చెప్పిన విషయం మర్చిపోయాడు.

రఘుపతితో మాట్లాడి ఇంట్లోకి వొచ్చాడు.

''బాత్‌రూములో మొహం కడుక్కోవచ్చుగా? ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి ఊయడమేమిటి?'' మొహం చిట్లించుకుంటూ అంది యామిని.

కోడలి మాటలు సూదుల్లా వొంటికి గుచ్చుకున్నట్లనిపించాయి.

... తాతయ్య ఎదురు నిలబడటానికే భయపడేది తన తల్లి. తాతయ్య యింట్లో వున్నంతసేపూ చాటు చాటుగా తిరిగేది... ఈ కోడలు పిల్ల మాత్రం తనను మాటలతో వుతికి పారేస్తుంది...

వాష్‌బేసిన్ దగ్గర అద్దంలో చూసుకున్నాడు.

అద్దంలో కుడి ఎడమౌతుంది... 'లెఫ్ట్' అవుతుంది...

మరి నిజజీవితంలోనో?

వృద్ధాప్యంలో ప్రేమానురాగాలు ఎడమౌతాయి కాబోలు... లెఫ్ట్... అర్థంకేరు...

నిట్టూర్పు విడిచేడు.

లక్ష్మీనాయుడు ఒకప్పుడు బాగా పేరుబడ్డ కాంట్రాక్టరు. లక్షలు సంపాదించడం, సంపాదించిన ఆస్తి చిల్లపెంకుల్లా ఖర్చుపెట్టడం జరిగిపోయాయి. కాస్త కూస్త మిగిలిపోయిన పొలం, ఇల్లు అమ్మి కొడుకుని ఇంజనీరు చదివించేడు. కొడుకు పెళ్ళయ్యాక కొత్తకాపురం ముచ్చటలు చూసుకునే అదృష్టం లేకుండానే లక్ష్మీనాయుడు భార్య చనిపోయింది. భార్య పోవడంతో కొడుకు ఉద్యోగం చేస్తున్న వూరు రాక తప్పలేదు.

కోడలు కలెక్టరుగారి కూతురు.

సోఫామీద కాళ్ళు పెట్టుకుని కూర్చున్నా, ఇంట్లో చుట్ట తాగినా పనివాళ్ళతో ఎక్కువగా మాట్లాడినా ఘోరమైన నేరాలే!

యామిని ఏం మాట్లాడినా చివాట్లు పెడుతున్నట్లుగానే వుంటుంది. లక్ష్మీనాయుడికి కొడుకు యింట్లో వుంటున్నా పరాయివాడి యింట్లో వున్నట్లు భావిస్తుంటాడు. తండ్రి కొడుకుల మధ్య సంబంధం ఎడమొహం, పెడ మొహంగానే వుంటున్నాయి. తనతో ఆత్మీయంగా మెసలే, వారే లేరనుకుంటాడు తండ్రి! పాత

వాసనలతో మరీ చాదస్తంగా తయారవుతున్నాడు తండ్రి అనుకుంటాడు కొడుకు.

వంటగదిలోకి వెళ్ళి టిఫిన్ పెట్టమన్నాడు లక్ష్మినాయుడు వంటవాడిని.

"ఇక్కడ మీకు టిఫిన్ పెడితే వా తోలు వొలిచేస్తారు బాబుగారు. దయచేసి మీరు డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చోండి. చిటికెలో తీసుకువొస్తాను వేడి, వేడి యిడ్లీలు" అన్నాడు వంటవాడు.

డైనింగ్ టేబుల్ దగ్గర అరగంటసేపు పడిగాపులు కాస్తేవేగాని వంటవాడు ఇడ్లీలు తీసుకురాలేదు. అది వాడి తప్పుకాదు. కరెక్టుగా టైం ప్రకారం భోజనంగాని, టిఫిన్‌గాని వొడ్డన జరగాలి. లేకపోతే వంటవాడిమీద యామిని విరుచుకుపడుతుంది.

కొడుకు కోడలు ముగ్గురు మనవళ్ళు వచ్చేక తన ప్లేటులో వేడి, వేడి ఇడ్లీలు పెట్టుకున్నాడు. చెట్నీ వేసుకుని ఐదు ఇడ్లీలు తినేశాడు.

తొమ్మిది అంకె గుర్తుకు వొచ్చింది ఆ సమయంలో లక్ష్మినాయుడికి.

మరో నాలుగు యిడ్లీలు ప్లేటులో పెట్టుకున్నాడు.

లక్ష్మినాయుడిది భారీ విగ్రహం. అరవయ్యేళ్ళు పైబడ్డా తిండి పుష్టిగలవాడు. ఎంత తిండి తిన్నా అరాయించుకొనే శరీరతత్వం.

సాంబారు గిన్నె తెచ్చి టేబుల్ మీద పెట్టాడు వంటవాడు.

అవాలోచితంగా గిన్నెలో చెయ్యిపెట్టి ఉల్లిపాయల గడ్డలకోసం వెతికాడు. సాంబారులో వేసే ఉల్లిపాయల గడ్డలంటే ప్రాణం లక్ష్మినాయుడుకి.

యామినికి వొంటిమీద తేళ్ళు జెర్రిలు పాకినట్లయ్యింది.

ఆమె మామగారికి ఎన్నోసార్లు చెప్పింది చేతులు గిన్నెల్లో పెట్టొద్దని, గరిటెతో వొడ్డించుకోమని.

విసురుగా లేచివెళ్ళి పక్కనే వున్న



## రికార్డు

పల్లెటూరు పీతాంబరం గ్రామఫోను రికార్డులు కొందామని ఓ షాపుకి వెళ్లాడు. సినిమాపేరు చెప్పి రికార్డు అడిగాడు షాపువాడిని. షాపువాడు తెచ్చి యిచ్చిన రికార్డు చూసి–

"ఏహేయ్ నేను పల్లెటూరి వాళ్ళా కనిపిస్తున్నానని నన్నేమోసం చేద్దామనుకున్నావా. ఆ పప్పులేం వుడకవ్. ఈ చిల్లున్న రికార్డు పట్టుకెళ్లి మంచిది పట్టుకురా" అరిచాడు పీతాంబరం.

–కె.వెంకటరామ అక్కయ్య (కంకిపాడు)

వాష్‌బేషిన్‌లో చేతులు కడిగేసుకుని తన గదిలోకి వెళ్ళిపోయింది.

వివేక్‌కి విషయం అర్థమైంది.

"రేపటినుంచి నాన్నగారికి ఆయన గదిలోకి భోజనం, టిఫిన్ తీసుకెళ్ళి వొడ్డించు" వంటవాడికి చెప్పాడు వివేక్.

వివేక్ కూడా లేచివెళ్ళి చెయ్యి కడిగేసుకున్నాడు.

తొమ్మిదవ యిడ్లీ గొంతుకు అడ్డం పడినట్లయ్యింది.

ప్లేటులోనే చెయ్యి కడుకున్నాడు.

"ప్లేటులో చేతులు కడుక్కోవొద్దని అమ్మగారు ఎప్పుడూ చెబుతూనే వుంటారు గదండీ!" అన్నాడు వంటవాడు.

వాడివైపు కళ్ళురిమి చూశాడు లక్ష్మినాయుడు. వీడిక్కూడ లోకువై పోయానను కున్నాడు.

కాలు గాలిన పిల్లిలా హాల్లో తిరిగాడు లక్ష్మినాయుడు.

ఇంట్లో ఎవ్వరూ తనతో మాట్లాడరు.

ఆఖరికి పిల్లలు కూడా తనతో మాట్లాడడానికి భయపడతారు. తల్లి యింట్లో లేనప్పుడు మాత్రం దగ్గర చేరతారు వాళ్ళు.

వాళ్ళకి తను చెప్పే కథలంటే యిష్టం.

బజార్లో తను కొనుక్కొని తీసుకువచ్చే బజ్జీలంటే యిష్టం. యామిని చూడకుండా వాళ్ళడిగినవి తెచ్చిపెడుతుంటాడు.

ఇంట్లోనేమి తోచక బయటకు వెళ్ళబోయాడు.

గేటుదగ్గర మిఠాయి దుకాణం పుల్లయ్య కన్పించేడు వివేక్‌తో మాట్లాడుతూ.

అప్పుడు గుర్తుకొచ్చింది పుల్లయ్యకు తను బాకీవున్న విషయం. బయట చిరుతిళ్ళు మంచిదికాదని కొడుకు మందలిస్తూ వుంటే ఈ మధ్య మిఠాయి దుకాణం కేసి వెళ్ళడం మానేశాడు.

పుల్లయ్యకు యివ్వాల్సిన పాతిక రూపాయల సంగతి మర్చిపోయాడు. కొడుకు దగ్గర డబ్బు తీసుకుని యివ్వ చ్చులేననుకున్నాడు. ఆ విషయమే గుర్తుకు రాలేదు. తన మతిమరుపుకు తిట్టుకున్నాడు తనను తానే.

వివేక్‌కు మిఠాయి దుకాణం పుల్లయ్య యింటికొచ్చి డబ్బులడగడం తప్పనిపించింది. పక్కింటివాళ్ళు పు ల్లయ్యకేసి తేరిపార చూడటం మరీ చిన్నతనమనిపించింది.

ఇకముందు తండ్రికి అప్పులు పెట్టొద్దని మందలిచి డబ్బులిచ్చి పుల్లయ్యను పంపించేశాడు.

"నాన్నగారు మీతో మాట్లాడాలి! లోపల కూర్చుందాం రండి!"

వివేక్‌కు కోపం వచ్చిందని గ్రహించాడు లక్ష్మినాయుడు.

హాల్లో సోఫాల్లో ఎదురెదురుగా కూర్చున్నారిద్దరూ.

"నాన్నగారు! మీరు పెద్దవారయ్యారు.

మి పద్ధతులు మార్చుకోవాలి. మీరు బయట కొనుక్కు తింటుంటే యింట్లో మిమ్మల్ని అర్ధాకలితో వుంచుతున్నట్లనుకుంటారు బయటవాళ్ళు. చుట్టలు తాగడం, చిరుతిళ్ళు తినడం, అప్పులు చెయ్యడం నచ్చదు నాకు. మీ అలవాట్లు నా పిల్లలకు వొచ్చే ప్రమాదం వుంది''

ఆ మాటలకు కోపంతో వూగిపోయాడు లక్ష్మినాయుడు.

''నువ్వు కూడా చిన్నప్పుడు నాగుజీడీలు కొనుక్కుని అప్పులు పెట్టేవాడివి. నా పెంపకంలో పెరిగి పెద్ద ఆఫీసరువు కాలేదూ? తాత పోలికలు మనవళ్ళకు రాకుండా ఎలా వుంటాయి?''

''నా పిల్లల మీద మీ ప్రభావం పడటానికి వీల్లేదు. వాళ్ళని క్రమశిక్షణతో మారుతున్న కాలానికి అనుగుణంగా తీర్చిదిద్దుతాను. మీరు అల్లరి చిల్లరి పనులు మానెయ్యాలి! మరోసారి మీ యిష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తే వూరుకునేది లేదు'' అన్నాడు గొంతు పెంచి వివేక్.

లక్ష్మినాయుడు కనుకొలకుల్లో నీళ్ళు నిలిచాయి.

... వివేక్ ఎంత మారిపోయాడు? కాలేజీలో చేరేవరకు తన ఎదుట నిలబడి మాట్లాడటానికే గడ, గడ వొణికిపోయేవాడు... ఇప్పుడెంత కర్కశంగా మాట్లాడుతున్నాడు... చిన్నప్పుడు స్కూలు ఎగ్గొట్టి తిరుగుతుంటే

మంచి మాటలు చెప్పి స్కూలుకు బుద్ధిగా వెళ్ళేటట్లు చేశాడు... జ్వరం వచ్చి మంచానికి అతుక్కుపోతే వారం రోజులు తిండితిప్పలు మానేసి కళ్ళల్లో ఒత్తులు వేసుకుని కనిపెట్టుకుని వాడి పక్కనే వుండిపోయాడు.. 'యామిని అందంగాలేదు ససేమిరా పెళ్ళి



## బెడ్ జాగింగ్

అనేకమంది దీర్ఘ వ్యాధులతో బాధ పడుతూ మంచం మీదే అన్ని పనులూ చేసుకొంటూ ఉంటారు. అలాటి రోగులకు వ్యాయామంలేక రక్త ప్రసరణ, జీవ ప్రక్రియలు, ఊపిరితిత్తులు, నెర్వస్ సిస్టం వంటి ముఖ్యమైన ప్రక్రియలు స్తంభించిపోతాయి. అలాటి వారికో శుభవార్త!

రష్యాలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ థీరీ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తలు అలాటి వారు "బెడ్" మీదపడుకునే "జాగింగ్" చేసే ఓ సరికొత్త యంత్రాన్ని రూపొందించారు. పడుకునే.. కావలసిన రీతిలో..అవసరమైన వేగంతో జాగింగ్ చేసినట్లే కాళ్ళు కదిపే ఈ యంత్రంవల్ల..దీర్ఘవ్యాధి గ్రస్తుల శరీరం కూడా ఆరోగ్యవంతుని శరీరంలా ఉంటుందంటున్నారు. ఆ శాస్త్రవేత్తలు! ఏది ఏమయినా..బద్ధకస్తులకు కూడా ఈ యంత్రం ఒక వరప్రసాదమే!

—జూపిటర్

చేసుకోనంటే' తనే నచ్చచెప్పి పెళ్ళి చేశాడు... ఇప్పుడు వాళ్ళిద్దరు వొక్కటి అయ్యారు... తనే పరాయి వాడైపోయాడు...

తన ఆలోచనలు, అలవాట్లు పాత వాసనలు కొట్టొచ్చు... అలా అయినంత మాత్రాన పెద్దవాళ్ళని పక్కకి నెట్టివెయ్యడమేనా?

వయస్సును గౌరవించే రోజులు పోయాయి?

కొంత సహనం, ఓర్పుతో పెద్దవాళ్ళని దగ్గరికి తీయవొచ్చు కదా? రేపు వీళ్ళు వృద్ధులు కారా?

మొక్కపై ఆకులు ఎండిపోయి రాలిపోతుంటే క్రిందవుండే పచ్చని ఆకులు ఫక్కున నవ్వుతాయట... క్రింది ఆకులు మాత్రం ఎండిపోవు?

వివేక్ భార్యని పిల్లలను తీసుకుని స్నేహితుడి ఇంట్లో పార్టీకి బయల్దేరారు.

బయటకు వెళ్తూ నిర్లక్ష్యంగా మామగారి వైపు చూస్తూ వెళ్ళింది యామిని.

ఆలోచనలు చుట్టుముట్టేశాయి శత్రుసైనికుల్లా అక్ష్మి వాయుడిని.. ప్రేమానురాగాలులేని జీవితం చావుతో సమానమేమో!

జీవితంలోని వెన్నెల రోజులన్నీ గడిచిపోయాయి...

చిన్నప్పుడు మామిడి తోపుల్లో ఆటలు—

నవ్వుల్ని విరజిమ్ముకుంటూ స్కూలుకు వెళ్ళడం—

చెరువులో ఈతలు ఇంటి దగ్గర తిట్లు

దొంగతనంగా కరణంగారి దొడ్లో జామ కాయలు కొయ్యడం—

తొలి యవ్వనపు గుర్తులు శరీరంలో చోటుచేసుకోగానే శారదకు సంపెంగపూలు కోసుకొచ్చి యివ్వడం—

ఆమె అందాలు పారిజాతపు పువ్వుల్లా మనస్సుకు ఆహ్లాదం కల్గిస్తుంటే పులకరించి పోవడం— ప్రేమించిన అమ్మాయి

దూరమవ్వడం— మరొకరితో వివాహం—

బాగా వయస్సు వొచ్చేక కంట్రాక్టరుగా డబ్బుతో గారడీలు...

ఆ తర్వాత అంకెలతో గారడీలు—

... బ్రాకెట్టు ఆటలు... పేకాటలు... లాటరీ టిక్కెట్లు...

కన్నుమూసి కన్ను తెరిచినంత సేపట్లోనే జీవితం ముగిసిపోతున్నదే!

ఏ సాధించాడు? చివరకు ఏం మిగిలింది?

ఆశలన్నీ అడియాసలయ్యాయి...

బ్రతుకులో అమావాస్య రోజులు ఎప్పుడో మొదలయ్యాయి...

చితికిపోయిన ఈ మనస్సును అతికించే వాళ్ళేలేరు...

వివేక్‌కు దూరంగా వెళ్ళిపోవాలి!

కూతురి దగ్గరకు వెళ్ళితే!

మనస్సుకు తగిలిన గాయాలు తప్పకుండా మానిపోతాయి... తనను తప్పకుండా ఆదరిస్తుంది. ఆ ఆలోచన

వొచ్చేక కొంచెం స్థిమితపడ్డాడు లక్ష్మినాయుడు.

* * *

చేతిలో చిన్న సంచితో ఉత్తరం ముక్కరాయకుండానే వచ్చేసిన తండ్రిని చూస్తే భార్గవికి ఆశ్చర్యమేసింది.

తండ్రి ఏదో బాధల్లో వున్నట్లనిపించింది ఆమెకు. ముఖంలో నవ్వుతెచ్చిపెట్టుకుని పలకరించింది.

వివేక్ కంటే ఐదేళ్ళు పెద్దది భార్గవి. బాగాకలిగిన కుటుంబంలోనే యిచ్చాడు కూతుర్ని.

భార్గవికి ఎనిమిది మంది సంతానం అత్తమామలేకుండానే మొగుడు వొదిలెయ్యడంతో భార్గవి ఆడపడుచుకూడా ఆ యింట్లోనే వుంటుం ది.

లక్ష్మినాయుడు వెళ్ళిన మొదటిరోజు యింట్లో అందరూ బాగానే పలుకరించారు. కానీ అతగాడు కూతురు దగ్గరే మాకాం వెయ్యబోతున్నాడని తెలిసి భార్గవి అత్తమామలు రుసరుసలు మొదలుపెట్టారు.

"కొడుకు పెద్ద ఆఫీసరయితే వాడి దగ్గర వుండక కూతురి దగ్గరకు వచ్చేవేమయ్యా? మా అందరికి సేవలు చెయ్యలేక నీ కూతురు సతమతమవుతుంటే నువ్వుకూడా యిక్కడ తిష్టవేస్తే ఎలా గయ్యా? తండ్రీ కొడుకులు మల్లగుల్లాలు పడటం ప్రతియింట్లో మామూలే గాని నీ కొడుకు దగ్గరకే తిరిగి వెళ్ళు!" భార్గవి మామగారు కుండబద్దలు కొట్టినట్లు లక్ష్మినాయుడిని వెళ్ళి పొమ్మని చెప్పాడు.

ఏం చెయ్యాలో పాలుబోలేదు లక్ష్మి నాయుడికి.


ఎవరో రంపంతో మెడను కోస్తున్నట్లనిపించింది.

తిరిగి కొడుకు దగ్గర కెళ్ళడం నామోషి అన్పించింది.

మళ్ళీచేతి సంచి పట్టుకుని ప్రయాణమయ్యాడు. గమ్యం ఎక్కడికో ఆయనకే తెలియదు.

బస్టాండు దగ్గర్లో వున్న హోటల్లో కెళ్ళి కూర్చున్నాడు.

ఎదురుగా కూర్చున్న వ్యక్తి చేతిలోవున్న పేపరు చూడగానే లాటరీ టిక్కెట్టు సంగతి



గుర్తుకు వొచ్చింది.
జేబు తడుముకున్నాడు.
భద్రంగానే వుంది జేబులో లాటరీ టికెట్టు.
పేపరు అడిగి తీసుకున్నాడు.
తన దగ్గరున్న హిమాచల్ స్టేట్ లాటరీ టిక్కెట్టు నెంబరు చూశాడు.
హెచ్‌జె– 542637
టిక్కెట్టు నెంబరు అంకెలన్నీ కూడాడు.
27 అంకె వొచ్చింది.
మళ్ళీ కూడాడు
తొమ్మిది అంకె వొచ్చింది.
లక్కీ నెంబర్!
లక్ష్మీనాయుడు ఆనందంతో వూగిపోయాడు.
ప్రథమ బహుమతి తనకే వొస్తుంది... తన కష్టాలన్నీ గట్టెక్కుతాయి... ఇతరుల మీద ఆధారపడే యిబ్బంది వుండదు...
ప్రథమ బహుమతి వొచ్చిన నెంబరు పేపర్లో చూశాడు.
హెచ్–542630
ఆఖరి అంకె లక్ష్మీనాయుడిని మోసం చేసింది.
దరిదాపుల్లోకి వొచ్చిన అదృష్టలక్ష్మి చెంప దెబ్బ కొట్టివెళ్ళిపోయింది.
'లాస్ట్ డిజిట్' మోసం చేసింది...
'జీరో' ఎంతపని చేసింది...
జీవితం ఆఖరి దశలో వున్న తనని అంకెల్లో చివరిది జీరో నిలువునా ముంచేసింది.
'లాస్ట్' డిజిట్ చేజారిపోయింది...
క్షణం ముందు తను కుబేరుడినని మురిసిపోయాడు.
కనురెప్పపాటులో కుచేలుడయిపోయాడు.
చుట్టూ గోరుచుట్టలా సలిపేస్తూ పరిస్థితులు-
ఏ బస్సు ఎక్కాలి?
ఏ వూరు వెళ్ళాలి?
ఏ బస్సు ఎక్కినా వొక్కటే! ఏ వూరు వెళ్ళినా వొక్కటే!
ముందు అంతా శూన్యం...
బస్సు వొచ్చి ఆగింది.
బెల్లం చుట్టూ ఈగల్లా బస్సు చుట్టూ మూగారు.
బస్సులోని వాళ్ళను దిగనివ్వకుండా ఎక్కేస్తున్నారు ప్రయాణికులు.
బస్సుఎక్కబోతున్న తనని దిగుతున్న వాళ్ళెవరో చెయ్యి పట్టుకుని ఆపడంతో చిరాగ్గా తలెత్తి చూశాడు.
ఎదురుగా కోపంగా చూస్తూ వివేక్.
''చెప్పాపెట్టాకుండా మీ యిష్టం వొచ్చినట్లు తిరిగితే ఎలా? మీరు వో పెద్ద సమస్యలా తయారయ్యారు! మీకు ఈ మధ్య మతిస్థిమితం సరిగ్గా లేనట్లుంది. అన్నీ పిచ్చి పిచ్చి పనులు చేస్తున్నారు... మంచి సైకియాట్రిస్ట్‌కు చూపించాలి మిమ్మల్ని'' అన్నాడు వివేక్ తండ్రి భుజం పట్టుకుని వొదలకుండా.
చీకటి పడకపోయినా చీకటి తెరలు చుట్టూ వున్న పరిసరాల్ని కమ్ముకున్నట్లనిపించింది లక్ష్మీనాయుడికి.
*